TGTEL/25/A0871

# తెలంగాణ వెన్నెల వాక్కు

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU

తెలంగాణ వెన్నెల వాక్కు TGTEL/25/A0871
విలేకరులు కావలెను
ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం
మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం
7386173123 నంబర్‌ను సంప్రదించండి..
డి. యోగేష్ కుమార్, సీఈవో

హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక :27 | 10-08- 2026 | సోమవారం | పేజీలు: 4 | వెల:03/-

# బోనాల జాతరతో హైదరాబాద్ భక్తిభావం

## పాతబస్తీలో అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు.. ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు



హైదరాబాద్, ఆగస్టు 9 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల ఉత్సవాలు హైదరాబాద్‌లో ఆదివారం ఘనంగా కొనసాగుతున్నాయి. పాతబస్తీలోని ప్రముఖ మహంకాళి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి తలపై బోనాలతో ఆలయాలకు చేరుకుని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

ఆషాఢ మాసంలో గ్రామదేవతలను కొలుస్తూ నిర్వహించే బోనాల పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంలో ప్రత్యేక స్థానం కలిగి ఉంది. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఈ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ముఖ్యంగా పాతబస్తీలోని మహంకాళి ఆలయాల్లో జరిగే ఉత్సవాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది.

ఆదివారం పాతబస్తీలోని ప్రముఖ ఆలయాల వద్ద ఉదయం నుంచే భక్తుల రద్దీ కనిపించింది. అమ్మవారికి బోనం సమర్పించేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బోనంతో పాటు పసుపు, కుంకుమ, వేప ఆకులు, చీర, గాజులు తదితర సంప్రదాయ వస్తువులను సమర్పించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి కుటుంబ 2

# తిరంగాతో దేశభక్తి పునరుజ్జీవనం

## 'హర్ ఘర్ తిరంగా'కు శ్రీకారం.. స్వాతంత్ర్య వేడుకలకు దేశవ్యాప్తంగా సన్నాహాలు



న్యూఢిల్లీ, ఆగస్టు 9 : దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సన్నాహాలు ఊపందుకున్నాయి. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ఆదివారం నుంచి ప్రారంభమైంది. దేశంలోని ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేయడం ద్వారా దేశభక్తి భావనను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పలు రాష్ట్రాల్లో తిరంగా యాత్రలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రజా భాగస్వామ్య కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఆదివారం నిర్వహించిన తిరంగా యాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కాకోరి ఘటనకు సంబంధించిన 101వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పాల్గొని తిరంగా యాత్రను ప్రారంభించారు. జాతీయ చిహ్నాలను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన వీరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు వచ్చే ఆగస్టు 9వ తేదీకి కూడా చారిత్రక ప్రాధాన్యం ఉంది. 1942లో ఇదే రోజున ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమం భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలక మలుపుగా నిలిచింది. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజలు ఒక్కటై ఉద్యమించడంతో స్వాతంత్ర్య పోరాటం మరింత ఉధృతమైంది. ఆ ఉద్యమంలో పాల్గొన్న వేలాది మంది స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే 1947లో దేశానికి స్వాతంత్ర్యం లభించింది.

ప్రస్తుతం దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న నేపథ్యంలో స్వాతంత్ర్య ఉద్యమ విలువలను కొత్త తరానికి పరిచయం చేయడం అవసరమని కేంద్ర ప్రభుత్వం పేర్కొంటోంది. కేవలం జాతీయ పతాకాన్ని ఎగురవేయడం మాత్రమే కాకుండా, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశ సమగ్రత, సామాజిక ఐక్యత వంటి విలువలను గౌరవించడం కూడా దేశభక్తిలో భాగమనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోంది.

పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక 2

# ఉక్రెయిన్‌పై రష్యా దాడులు తీవ్రం

## బ్లాక్ సీపై యుద్ధ ప్రభావం.. వాణిజ్య నౌకల భద్రతపై ఆందోళన



2

# తెలంగాణలో వర్షాలకు కాస్త విరామం

## ఉత్తర, తూర్పు జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు.. రైతుల్లో కొనసాగుతున్న ఆశలు



హైదరాబాద్, ఆగస్టు 9 : రాష్ట్రంలో గత కొద్దిరోజులుగా కురిసిన వర్షాలకు ఆదివారం నుంచి కొంత విరామం లభించే అవకాశం ఉందని తాజా వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి. అయితే ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటికే భారీ వర్షాలతో అనేక ప్రాంతాల్లో నేల తడిసి ఉండటంతో వ్యవసాయ పనులు, రహదారి రాకపోకలు, సాగునీటి వనరుల పరిస్థితిపై అధికారులు దృష్టి సారించారు. 3

# చీఫ్ గెస్ట్‌గా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వద్దు!

## నల్సార్ వర్సిటీ విద్యార్థుల తీవ్ర అభ్యంతరం




హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోని ప్రముఖ న్యాయ విద్యా సంస్థ 'నల్సార్' (చీూూూూ= ఖఅఅజవతీంఓఎ శీట ూఋఙ) స్నాతకోత్సవ (జశీఅజశీఝఅశీఅ 2026) ఆనవాయితీపై తీవ్ర కలకలం రేగుతోంది. రాబోయే 2026 కాన్వకేషన్ వేడుకకు భారత ప్రధాన న్యాయమూర్తి (జజీ×) జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించాలన్న వర్సిటీ ప్రతిపాదనపై విద్యార్థులు తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు సీజేఐను చీఫ్ గెస్ట్‌గా పిలవకూడదని డిమాండ్ చేస్తూ 450 మందికి పైగా విద్యార్థులు నల్సార్ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ మరియు పాలకవర్గానికి సంయుక్తంగా ఒక లేఖ రాశారు.

విద్యార్థుల అభ్యంతరానికి ప్రధాన కారణాలేంటి? ఇటీవల న్యూఢిల్లీలో నీట్ (చీజుఋ) పరీక్షా వివాదాలు, విద్యార్థుల ఆందోళనలు మరియు పోలీస్ చర్యలపై సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలే ఈ వ్యతిరేకతకు మూలకారణమని విద్యార్థులు లేఖలో పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న యువత మరియు విద్యార్థులపై పోలీసుల ప్రవర్తనను ప్రశ్నిస్తూ దాఖలైన పిటిషన్ల విచారణ సమయంలో సీజేఐ చేసిన వ్యాఖ్యలు తమను తీవ్రంగా కలచివేశాయని 2

# ఎస్‌ఐఆర్‌పై తెలంగాణలో దుమారం

## ఎన్యుమరేషన్ ఫారాల స్వీకరణపై ఫిర్యాదులు.. ఈసీ జోక్యం కోరిన ఒవైసీ

హైదరాబాద్, ఆగస్టు 9 : తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియపై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. ఎస్‌ఐఆర్ ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తుండగా, ఎన్యుమరేషన్ ఫారాల స్వీకరణకు సంబంధించి కొన్ని ప్రాంతాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. ఆగస్టు 9, 10 తేదీల్లో ఫారాల స్వీకరణ విషయంలో సమస్యలు ఎదురవుతున్నాయని, దీనిపై ఎన్నికల సంఘం తక్షణమే దృష్టి సారించాలని ఆయన కోరారు.

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన ప్రతి పౌరుడికి సమాన అవకాశం కల్పించడం అత్యంత ముఖ్యమని రాజకీయ పార్టీలు పేర్కొంటున్నాయి. ఎస్‌ఐఆర్‌లో భాగంగా ఓటర్ల వివరాలను పరిశీలించడం, అవసరమైన పత్రాలను సేకరించడం, ఇప్పటికే జాబితాలో ఉన్న పేర్లను ధ్రువీకరించడం వంటి ప్రక్రియలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఫారాలు అందుబాటులో లేకపోవడం, స్వీకరించకపోవడం లేదా నిర్ణీత సమయంలో అధికారులు అందుబాటులో లేకపోవడం వంటి అంశాలపై ఫిర్యాదులు వస్తే వాటిని వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితా కీలకమైనది. ఒక అర్హుడైన ఓటరు పేరు జాబితాలో లేకపోయినా, అనర్హుడి పేరు కొనసాగినా ఎన్నికల ప్రక్రియపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. అందుకే ఓటర్ల జాబితా సవరణ సమయంలో ప్రతి ఇంటిని సందర్శించి వివరాలను సేకరించడం, తప్పులు ఉంటే సరిచేయడం, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి వివరాలను పరిశీలించడం వంటి చర్యలు చేపడతారు.

తెలంగాణలో ఎస్‌ఐఆర్ ప్రక్రియపై రాజకీయ పార్టీలు ఇప్పటికే తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నాయి. ఓటర్ల హక్కులను కాపాడటంతో పాటు, అర్హులైన ప్రతి వ్యక్తి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాలని ప్రతిపక్ష పార్టీలు కోరుతున్నాయి. మరోవైపు ఎన్నికల అధికారులు మాత్రం నిబంధనల ప్రకారం ప్రక్రియను నిర్వహించాల్సి ఉంటుందని 3

# పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన కేసీఆర్

## రూ. 2.25 కోట్ల ఆర్థిక సాయం అందజేత



2

# గ్రామీణ ఉపాధికి ఆర్థిక గ్రహణం..!

## కేంద్ర నిధుల కోత – రాష్ట్రాల ధర్మసంకటం






కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో తీసుకొచ్చిన నూతన ఆర్థిక నిబంధనలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా కేంద్ర-రాష్ట్ర సంబంధాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక కీలకమైన సామాజిక సంక్షేమ పథకంలో పెద్ద ఎత్తున వ్యయాన్ని పంచుకోవాలని కేంద్రం కోరడం రాష్ట్ర ప్రభుత్వాలకు మింగుడుపడని అంశంగా తయారైంది.

ముఖ్యంగా శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించడం కోసం రకరకాల ఉచిత హామీలు గుప్పించి, ఇప్పటికే తీవ్ర ఆర్థిక ఒత్తిడిలో ఉన్న రాష్ట్రాలకు ఈ నిర్ణయం ఒక పెద్ద సవాలుగా మారింది. ఫలితంగా, ప్రతిపక్షాలు పాలించే రాష్ట్రాలు కేంద్ర నిర్ణయంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

రెండు దశాబ్దాల క్రితం ప్రారంభమైనప్పటి నుండి 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' (ప్రస్తుతం 'వికసిత్ భారత్ – గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ – (గ్రామీణ్' లేదా ఎదీ–+=ూవీ–+ గా వ్యవహరిస్తున్నది) పూర్తిగా కేంద్ర నిధులతోనే నడిచింది. 2006లో యుపిఎ ప్రభుత్వం దీనిని ప్రారంభించిన మొదటి పదేళ్లు, ఆ తర్వాత వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం కూడా కూలీల వేతనాలకు సంబంధించిన పూర్తి ఖర్చును యూనియన్ బడ్జెట్ నుంచే సమకూర్చాయి. కానీ నూతన మార్పుల ప్రకారం, ఒక రాష్ట్రానికి ఉపాధి కల్పన కోసం రూ. 100 కోట్లు అవసరమైతే, అందులో రూ. 60 కోట్లు మాత్రమే కేంద్రం ఇస్తుంది. మిగిలిన రూ. 40 కోట్లను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే తమ సొంత బడ్జెట్ నుంచి కేటాయించాలి. కేవలం హిమాలయ, ఈశాన్య రాష్ట్రాలకు 90:10 నిష్పత్తిని, శాసనసభలు లేని కేంద్రపాలిత ప్రాంతాలకు పూర్తి నిధులను మినహాయింపుగా ఉంచారు.

ఈ నిర్ణయం వల్ల కేవలం ప్రతిపక్ష రాష్ట్రాలే కాకుండా, భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలు కూడా అంతర్గతంగా ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నాయి. పరిమితంగా ఉండే రాష్ట్రాల రాబడిలో ఇంత పెద్ద మొత్తాన్ని ఒకే పథకానికి కేటాయించాల్సి రావడం వల్ల ఇతర అభివృద్ధి పనులకు నిధులు కొరవడే పరిస్థితి ఏర్పడింది. బహిరంగంగా విమర్శించలేకపోయినా, బీజేపీ పాలిత రాష్ట్రాల ఆర్థిక మంత్రులు కూడా తమ పరిమితుల మధ్య మౌనంగానే సతమతమవుతున్నారు. వనరుల పంపిణీలో తమకున్న పరిమితులను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రం సేకరించే పన్నుల్లో తగిన వాటా ఇవ్వకపోవడం, పైగా పథకాల భారాన్ని రాష్ట్రాలపై మోపడం న్యాయం కాదని అంతర్గత చర్చల్లో భావిస్తున్నారు. మరోవైపు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, కేరళ, పంజాబ్, జార్ఖండ్ వంటి ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు మాత్రం కేంద్ర నిర్ణయాన్ని బహిరంగంగానే తీవ్రంగా ఖండిస్తున్నాయి.

ఈ వ్యతిరేకతకు కేవలం రాజకీయ కారణాలే కాకుండా సామాజిక, ఆర్థిక మూలాలు కూడా ఉన్నాయి. రాజకీయంగా చూస్తే, ఇది కాంగ్రెస్ హయాంలో వచ్చిన పథకం కావడం, బీజేపీ దీని ప్రాధాన్యతను తగ్గించే ప్రయత్నం చేస్తోందనే విమర్శలు ఉన్నాయి. సామాజిక కోణంలో పరిశీలిస్తే, గ్రామీణ ప్రాంతాల్లో సరైన పని దొరకని పేద రైతులు, వ్యవసాయ కూలీలకు ఇది ఒక ప్రాథమిక జీవనాధారంగా, ఆదాయ భద్రతగా మారింది. గ్రామాల్లో కరువు పరిస్థితులు ఏర్పడినప్పుడు లేదా వ్యవసాయ పనులు లేని సీజన్లలో ఈ పథకమే కోట్లాది కుటుంబాలకు ఆసరాగా నిలుస్తోంది. ఇక ఆర్థికపరంగా, ఈ పథకం ఇచ్చే దినసరి కూలీ గ్రామీణ ప్రాంతాల్లో వేతనాలకు ఒక కనీస ప్రామాణికంగా పనిచేస్తోంది. ఈ పథకం అందుబాటులో ఉండటం వల్ల కూలీలు అతి తక్కువ వేతనాలకు పని చేయాల్సిన దుస్థితి తప్పింది. ఒకవేళ ఈ పథకం బలహీనపడితే గ్రామీణ వేతనాలు దారుణంగా పడిపోయే ప్రమాదం ఉంది.

రాష్ట్రాల ఆర్థిక మంత్రులు తమ బడ్జెట్ ప్రసంగాల్లో ఈ నిబంధనల మార్పును తీవ్రంగా తప్పుపట్టారు. తెలంగాణ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క మల్లు ఉపాధి హామీని కేవలం ఒక పథకంగా కాకుండా పౌరుల ఉపాధి హక్కుగా అభివర్ణిస్తూ, గత రెండు దశాబ్దాలుగా ఇది గ్రామాల్లో నిశ్శబ్ద విప్లవం తెచ్చిందని గుర్తుచేశారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గ్రామీణ కార్మికుల హక్కులను, సమాఖ్య వ్యవస్థలోని వికేంద్రీకరణ సూత్రాలను కాపాడేందుకు న్యాయపోరాటానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. కేరళ, తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాలు కూడా కేంద్ర వైఖరి గ్రామీణ పేదల ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. కేంద్రం నిధుల కేటాయింపును తగ్గించడం అంటే రాజ్యాంగం ప్రసాదించిన అధికార వికేంద్రీకరణ భావనకు విఘాతం కలిగించడమేనని స్పష్టం చేశాయి.

అయితే, ఈ రాజకీయ నిరసనలు, విమర్శలు ఎలా ఉన్నప్పటికీ, ఆచరణలోకి వచ్చేసరికి ప్రతిపక్ష రాష్ట్రాలు సైతం వాస్తవ రాజకీయ పరిస్థితిని అంగీకరించక తప్పలేదు. కేంద్రం నిబంధనలు మార్చినప్పటికీ, ఈ ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌లలో రాష్ట్రాలు ఈ పథకానికి నిధులు కేటాయించక తప్పలేదు. తమిళనాడు ప్రభుత్వం రూ. 5,057 కోట్లను కేటాయించి, తన 40 శాతం వాటాను నిలబెట్టుకోవడమే కాకుండా, అదనంగా మరో రూ. 100 కోట్లు వెచ్చించి ఉపాధి ?ెలను 150 రోజులకు పెంచుతున్నట్లు ప్రకటించింది. కర్ణాటక, తెలంగాణ, జార్ఖండ్ రాష్ట్రాలు కూడా తమ బడ్జెట్లలో సరిగ్గా 40 శాతం వాటా నిధులను కేటాయించాయి. కేరళ, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలు మొదటి విడతగా కొంత మొత్తాన్ని కేటాయించి, సంవత్సరం చివరినాటికి మిగిలిన నిధులను భరిస్తామని తెలిపాయి.

కేంద్రంపై తీవ్ర అసంతృప్తి ఉన్నప్పటికీ రాష్ట్రాలు ఈ పథకానికి భారీగా నిధులు కేటాయించడానికి బలమైన కారణం ఉంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, పేదల జీవన ప్రమాణాలను స్థిరంగా ఉంచడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోంది. ఉపాధి భద్రతతో పాటు ఆర్థిక నిలకడను ఇచ్చే ఇటువంటి పథకాన్ని నిర్లక్ష్యం చేస్తే గ్రామీణ ప్రాంతాల్లో తీవ్రమైన ఆర్థిక సంక్షోభం చెలరేగే అవకాశం ఉంది. గ్రామాల్లో కొనుగోలు శక్తి తగ్గితే అది పరోక్షంగా దేశ మొత్తం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అందుకే, ఎంత ఆర్థిక భారం పడుతున్నప్పటికీ, కేంద్ర విధానాలతో విభేదిస్తూనే రాష్ట్రాలు తమ వంతు వాటాను కేటాయించి ఉపాధి హామీని ముందుకు తీసుకెళ్తున్నాయి. సమాఖ్య వ్యవస్థలో కేంద్రం మరియు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకోవాలి తప్ప, సంక్షేమ పథకాల నిధుల భారాన్ని రాష్ట్రాలపై నెట్టడం శ్రేయస్కరం కాదు. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ క్షేత్రస్థాయి వాస్తవాలను గుర్తించి, తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

# ఉక్రెయిన్‌పై రష్యా దాడులు తీవ్రం

కీవ్, ఆగస్టు 9 : రష్యా––ఉక్రెయిన్ యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చుతోంది. రెండు దేశాల మధ్య దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో బ్లాక్ సీ ప్రాంతంలో వాణిజ్య నౌకల భద్రతపై ఆందోళనలు పెరుగుతున్నాయి. రష్యా, ఉక్రెయిన్ పరస్పరం డ్రోన్లు, క్షిపణులతో దాడులు కొనసాగిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో బ్లాక్ సీ ప్రాంతంలో సైనిక చర్యలను తగ్గించేందుకు ఇరుదేశాలు తాత్కాలికంగా దాడులకు విరామం ఇవ్వాలని టర్కీ ప్రతిపాదించింది.

టర్కీ విదేశాంగ మంత్రి హకాన్ ఫిదాన్ రష్యా, ఉక్రెయిన్ రెండు దేశాలు బ్లాక్ సీ ప్రాంతంలో దాడులకు తాత్కాలిక విరామం ప్రకటించాలని కోరారు. ప్రస్తుతం సైనిక లక్ష్యాలకే పరిమితం కాకుండా వాణిజ్య నౌకలు, నౌకాశ్రయాలు, రవాణా మౌలిక వసతులు కూడా యుద్ధ ప్రభావానికి గురవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బ్లాక్ సీ ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన సముద్ర మార్గం కావడంతో అక్కడ నెలకొన్న ఉద్రిక్తత అంతర్జాతీయ సరఫరా వ్యవస్థపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది.

ఇటీవల ఉక్రెయిన్‌లోని ఒడెసా, మైకొలైవ్ ప్రాంతాల్లో రష్యా దాడులు కొనసాగినట్లు సమాచారం. నౌకాశ్రయ ప్రాంతాలు, గోదాములు, ఇతర మౌలిక వసతులు దెబ్బతిన్నట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు రష్యా భూభాగంలోని చమురు శుద్ధి కేంద్రాలు, ఇంధన మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ డ్రోన్ దాడులు కొనసాగిస్తోంది. దీంతో రెండు దేశాల మధ్య దాడులు పరస్పర ప్రతీకార చర్యలుగా మారుతున్నాయి.

కీవ్ ప్రాంతంలో రష్యా డ్రోన్ దాడిలో మూడేళ్ల బాలుడు, అతని తాత, నానమ్మ మరణించినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ వెల్లడించారు. మరో క్షిపణి దాడిలో కూడా ఒకరు మరణించినట్లు సమాచారం. ఒకే రాత్రిలో భారీ సంఖ్యలో డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులతో దాడులు జరిగినట్లు ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. ప్రజలను రక్షించేందుకు భూగర్భ బంకర్లు, రక్షణ కేంద్రాల్లోకి తరలించే చర్యలు చేపట్టాల్సి వచ్చింది.

యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఉక్రెయిన్ రక్షణ వ్యవస్థకు ప్రధాన సవాలుగా నిలిచిన బాలిస్టిక్ క్షిపణుల దాడులు ఇటీవల మరింత పెరిగాయి. వాటిని అడ్డుకునేందుకు అవసరమైన ఆధునిక వైమానిక రక్షణ వ్యవస్థల కొరత ఉందని ఉక్రెయిన్ ప్రభుత్వం చెబుతోంది. ముఖ్యంగా అమెరికా తయారీ పేట్రియట్ రక్షణ వ్యవస్థలకు సంబంధించిన క్షిపణుల కొరత తీవ్రంగా ఉందని అధ్యక్షుడు జెలెన్‌స్కీ అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకెళ్తున్నారు. మరోవైపు రష్యా కూడా ఉక్రెయిన్ డ్రోన్ దాడులను ఎదుర్కొంటోంది. రష్యాలోని చమురు శుద్ధి కేంద్రాలు, ఇంధన నిల్వ ప్రాంతాలపై ఉక్రెయిన్ దాడులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ దాడుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించాయి. యుద్ధం కేవలం సరిహద్దు ప్రాంతాలకు పరిమితం కాకుండా రెండు దేశాల ఆర్థిక, ఇంధన వ్యవస్థలపై ప్రభావం చూపుతోంది.

ఈ పరిస్థితుల్లో బ్లాక్ సీ ప్రాంతంలో శాంతి, భద్రత నెలకొల్పడం అంతర్జాతీయంగా అత్యంత కీలకంగా మారింది. ఈ ప్రాంతం ద్వారా ధాన్యం, ఇంధనం, ఇతర వాణిజ్య సరుకుల రవాణా జరుగుతుంది. సముద్ర మార్గాలపై దాడులు పెరిగితే సరఫరా వ్యవస్థలకు అంతరాయం కలగడంతో పాటు ప్రపంచ మార్కెట్లలో ధరలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది.

రష్యా––ఉక్రెయిన్ యుద్ధానికి పరిష్కారం కనుగొనేందుకు అంతర్జాతీయ స్థాయిలో అనేక ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో దాడులు తగ్గడం లేదు. యుద్ధ విరమణపై చర్చలు జరగాల్సిన సమయంలో ఇరువైపులా సైనిక చర్యలు కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. బ్లాక్ సీ ప్రాంతంలో కనీసం వాణిజ్య నౌకలకు రక్షణ కల్పించేందుకు తాత్కాలిక అవగాహన అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

యుద్ధం మరింత విస్తరించకుండా అడ్డుకోవడం, సాధారణ ప్రజల ప్రాణాలను కాపాడటం, అంతర్జాతీయ వాణిజ్య మార్గాలను సురక్షితంగా ఉంచడం ఇప్పుడు ప్రపంచ దేశాల ముందున్న ప్రధాన సవాళ్లుగా మారాయి. టర్కీ తాజా ప్రతిపాదనకు రష్యా, ఉక్రెయిన్ ఎలా స్పందిస్తాయన్నది అంతర్జాతీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

## చీఫ్ గెస్ట్‌గా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వద్దు!

విద్యార్థులు తెలిపారు.

"పోలీసుల లాఠీఛార్జ్, అణచివేతకు సంబంధించిన వీడియో ఆధారాలను చూడటానికి మాకు ఆసక్తి లేదు, వాటిని చూసేంత సమయం మాకు లేదు; మా సమయాన్ని, మీ సమయాన్ని వృథా చేయకండి" అని సీజేఐ వ్యాఖ్యానించడంపై విద్యార్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అలాగే గతంలో యువతను ఉద్దేశించి చేసిన కొన్ని వ్యాఖ్యలు కూడా తమను ఆవేదనకు గురిచేసాయని, ఇది హక్కుల కోసం పోరాడే విద్యార్థుల పట్ల న్యాయ వ్యవస్థ చూపించే ఉదాసీనతకు అద్దం పడుతోందని లేఖలో స్పష్టం చేశారు.

రాజ్యాంగ విలువలు – స్నాతకోత్సవ ప్రాధాన్యంఎంతో కష్టపడి ఐదేళ్ల పాటు చదివి, తమ జీవితంలో అత్యంత కీలకమైన డిగ్రీ పట్టాలను అందుకునే క్షణం విద్యార్థులకు ఎంతో భావోద్వేగమైనదని నల్సార్ గ్రాడ్యుయేటింగ్ బ్యాచ్ (2026) విద్యార్థులు స్పష్టం చేశారు. రాజ్యాంగ బద్ధత, ప్రాథమిక హక్కులు, పౌర స్వేచ్ఛ మరియు బాధితులకు న్యాయం అందించే సూత్రాలను నల్సార్ వర్సిటీ బోధిస్తుందని, అటువంటి సంస్థకు ప్రతినిధులుగా మేము డిగ్రీలు తీసుకుంటున్నప్పుడు, పౌరుల హక్కుల ఆందోళనలను తోసిపుచ్చిన వ్యక్తి చేతుల మీదుగా పట్టాలు అందుకోవడం సరైనది కాదని విద్యార్థులు వాదించారు.

# బోనాల జాతరతో హైదరాబాద్ భక్తిభావం

సభ్యులు ఆరోగ్యంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని, రాష్ట్రంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.

బోనాల సందర్భంగా పాతబస్తీ ప్రాంతం భక్తి వాతావరణంతో కళకళలాడింది. ఆలయ పరిసరాల్లో ప్రత్యేక అలంకరణలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల కోసం మంచినీరు, వైద్య సేవలు, పారిశుధ్య ఏర్పాట్లు వంటి సౌకర్యాలను అధికారులు ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

బోనాల ఊరేగింపులు జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు కూడా ప్రత్యేక చర్యలు చేపట్టారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉండటంతో ఆలయాల వద్ద సీసీ కెమెరాల ద్వారా పరిస్థితిని పర్యవేక్షించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు పోలీసు, వైద్య, విపత్తు నిర్వహణ సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

బోనాల పండుగలో మహిళల పాత్ర ప్రత్యేకంగా కనిపిస్తుంది. ఇంట్లో తయారు చేసిన బోనాన్ని తలపై పెట్టుకుని ఆలయానికి తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించడం ఈ పండుగలో ప్రధాన సంప్రదాయం. అన్నం, పాలు, బెల్లంతో తయారు చేసిన నైవేద్యాన్ని ప్రత్యేకంగా అలంకరించిన మట్టి లేదా ఇత్తడి పాత్రలో ఉంచి వేప ఆకులతో అలంకరిస్తారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి సమర్పిస్తారు.

తెలంగాణలో బోనాలు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమం మాత్రమే కాకుండా రాష్ట్ర సంస్కృతి, ప్రజల జీవన విధానం, స్థానిక సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగగా గుర్తింపు పొందాయి. గ్రామదేవతలను కొలిచే సంప్రదాయం తరతరాలుగా కొనసాగుతోంది. పట్టణ జీవన విధానం వేగంగా మారుతున్నప్పటికీ బోనాల సమయంలో ప్రజలు తమ సంప్రదాయాలను గుర్తుచేసుకుని కుటుంబ సమేతంగా ఉత్సవాల్లో పాల్గొంటున్నారు.

పాతబస్తీలో జరిగే బోనాల వేడుకలకు చారిత్రక ప్రాధాన్యం కూడా ఉంది. అనేక పురాతన ఆలయాల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయాలు ఇప్పటికీ అదే ఉత్సాహంతో కొనసాగుతున్నాయి. ఆలయ కమిటీలు, స్థానిక ప్రజలు కలిసి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా వివిధ ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు, ఊరేగింపులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

బోనాల ఉత్సవాల సందర్భంగా ప్రజలు సంప్రదాయాలను పాటిస్తూ పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, భక్తుల రద్దీ సమయంలో అప్రమత్తంగా వ్యవహరించడం వంటి సూచనలు చేస్తున్నారు.

హైదరాబాద్ నగరంలో బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తున్నాయి. నగరానికి చెందిన వారితో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు ఉత్సవాలను చూసేందుకు తరలివస్తున్నారు. బోనాల సందర్భంగా తెలంగాణ సంప్రదాయ కళారూపాలు, డప్పు వాయిద్యాలు, పోతరాజుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

ఆషాఢ మాసం ముగింపు దశకు చేరుకోవడంతో ఈ ఏడాది బోనాల ఉత్సవాలు కూడా తుది దశకు చేరుకున్నాయి. చివరి ఆదివారం కావడంతో పలు ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చే ఉత్సవాల్లో బోనాలు ఒకటిగా నిలుస్తున్నాయి. తరతరాలుగా వస్తున్న ఆచారాలను కొనసాగిస్తూ యువత కూడా ఉత్సవాల్లో భాగస్వాములు కావడం విశేషం. భక్తి, సంప్రదాయం, సాంస్కృతిక వైభవం కలగలిసిన బోనాల పండుగ హైదరాబాద్ నగరాన్ని మరోసారి ఆధ్యాత్మిక సందడితో నింపింది.

# తిరంగాతో దేశభక్తి పునరుజ్జీవనం

సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు తిరంగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నాయి. యువతలో దేశభక్తి భావన పెంపొందించడంతో పాటు స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను ప్రజలకు తెలియజేసేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు జాతీయ పతాకాలతో యాత్రలు నిర్వహించడం, దేశభక్తి గీతాలు ఆలపించడం, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇళ్లపై జాతీయ పతాకాలను ఎగురవేసేలా ప్రజలను ప్రోత్సహించడంతో పాటు జాతీయ పతాకాన్ని గౌరవప్రదంగా ఉపయోగించాలని అధికారులు సూచిస్తున్నారు. జాతీయ పతాకానికి సంబంధించిన నియమాలను పాటించాలని, పతాకాన్ని అవమానించే విధంగా వ్యవహరించరాదని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

దేశ స్వాతంత్ర్యం సాధించి దశాబ్దాలు గడిచినా స్వాతంత్ర్య పోరాటం అందించిన స్ఫూర్తి నేటికీ ప్రాధాన్యాన్ని కలిగి ఉందని పలువురు పేర్కొంటున్నారు. కుల, మత, ప్రాంత, భాషా భేదాలకు అతీతంగా భారతీయులంతా ఒక్కటిగా నిలవడమే స్వాతంత్ర్య సమరయోధులకు నిజమైన నివాళి అవుతుందని అభిప్రాయపడుతున్నారు.

ఆగస్టు 15 వరకు దేశవ్యాప్తంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాలు కొనసాగనున్న నేపథ్యంలో మరింత మంది ప్రజలు ఇందులో భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిస్తున్నారు. ప్రతి ఇంటిపై ఎగిరే త్రివర్ణ పతాకం దేశ ఐక్యతకు, స్వాతంత్ర్య స్ఫూర్తికి ప్రతీకగా నిలవాలని ఆకాంక్షిస్తున్నారు.

# పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన కేసీఆర్

వరంగల్ బ్యూరో వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గ పరిధిలోని నల్లబెల్లి గ్రామంలో ఆదివారం భావోద్వేగపూరిత వాతావరణం నెలకొంది. ఇటీవల గుండెపోటుతో ఆకస్మికంగా కన్నుమూసిన బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాసానికి బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) చేరుకున్నారు. సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కేసీఆర్ ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తీవ్ర దుఃఖంలో ఉన్న పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు.

తెలంగాణ ఉద్యమ కాలం నుంచి పార్టీకి, నియోజకవర్గానికి సుదర్శన్‌రెడ్డి అందించిన సేవలను కేసీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.కష్టకాలంలో ఉన్న ఉద్యమ నేత కుటుంబానికి అండగా నిలవాలని బీఆర్ఎస్ నిర్ణయించిన నేపథ్యంలో, పార్టీ తరఫున ప్రకటించిన రూ. 2.25 కోట్ల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను కేసీఆర్ స్వయంగా అందజేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లల భవిష్యత్తు, ఉన్నత చదువులను దృష్టిలో ఉంచుకుని వారి పేరిట చెరో రూ. కోటి చొప్పున మొత్తం రూ. 2 కోట్లు కేటాయించగా, ఆయన తల్లి అమృతమ్మ బాగోగులు మరియు సంక్షేమం కోసం రూ. 25 లక్షల చెక్‌ను అందించారు. కేవలం ఆర్థిక సాయంతోనే సరిపెట్టకుండా, పిల్లల చదువులు, వారి భవిష్యత్తు మరియు కుటుంబ సంక్షేమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కేసీఆర్ భరోసా ఇచ్చారు.గుండెపోటుకు గురై హైదరాబాదులోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పెద్ది సుదర్శన్‌రెడ్డి కన్నుమూయడం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. నల్లబెల్లి మండల జెడ్పీటీసీగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడిగా, పోలిట్‌బ్యూరో సభ్యుడిగా, నర్సంపేట ఎమ్మెల్యేగా ఆయన ఎదిగిన తీరు

# కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు విశ్వంబర్‌కు మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి సత్కారం

**– నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని పిలుపు**



ముధోల్, ఆగస్టు 9 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల ఎస్సీ సెల్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన జోందలే విశ్వంబర్‌ను ముధోల్ మాజీ శాసనసభ్యుడు జి. విఠల్ రెడ్డి ఆదివారం ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మండల కేంద్రంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆయనకు పూలమాలలు వేసి శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా విఠల్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న సాధారణ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. విశ్వంబర్‌ను నియమించినందుకు కాంగ్రెస్ రాష్ట్ర కమిటీకి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వెడ్మ భోజ్జు పటేల్‌కు, ఎస్సీ సెల్ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నూతన అధ్యక్షుడు విశ్వంబర్ మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి, కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎస్సీ సెల్‌ను మరింత బలపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాపే వారి కిష్టయ్య, ముధోల్ సర్పంచ్ ఎజాజుద్దీన్, ఎస్సీ సెల్ నాయకుడు జంగ్మె సాహెబ్రావ్, సర్పంచులు ఆరిఫ్, దిగంబర్, మాజీ ఎంపీపీ అఫ్రోజ్ ఖాన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉత్తమ్ బాలేరావు, జిల్లా సెక్రటరీ బషీర్, జనరల్ సెక్రటరీ పోతన్న యాదవ్ పాల్గొన్నారు.

# ఉప సర్పంచులపై భూమన్న యాదవ్ అనుచిత వ్యాఖ్యలు సరికాదు: సాయినాథ్ గౌడ్

**– ఉప సర్పంచులకు రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్**



ముధోల్, ఆగస్టు 9 (తెలంగాణ వెన్నెల వాక్కు):
గ్రామ పంచాయతీల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఉప సర్పంచులపై రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూమన్న యాదవ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం నాయకులు తీవ్రంగా ఖండించారు. నిర్మల్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్, చించాల ఉప సర్పంచ్ పీసర సాయినాథ్ గౌడ్ ఆధ్వర్యంలో ముధోల్ మండల ఉప సర్పంచులు ఆదివారం ఒకమ్మడి ప్రకటన విడుదల చేశారు. గ్రామాల్లో సర్పంచులతో కలిసి ఉప సర్పంచులు సోదర భావంతో నిరంతరం శ్రమిస్తున్నారని ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ఆర్థిక వ్యవహారాలు ఒకరి చేతిలోనే కేంద్రీకృతం కాకుండా పారదర్శకంగా ఉండేందుకు ప్రభుత్వం ఉప సర్పంచులకు చెక్ పవర్ కల్పించిందన్నారు. చెక్ పవర్ రద్దు చేయాలని మాట్లాడటం అభ్యంతరకరమన్నారు. ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు గౌరవ వేతనం కల్పించాలని, శంకుస్థాపనల శిలాఫలకాలపై తమ పేర్లు ఉండేలా చూడాలని ప్రభుత్వం వద్ద వినతులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తమ హక్కుల కోసం పోరాడుతున్న ఉప సర్పంచుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడిన భూమన్న యాదవ్ రాష్ట్రంలోని ఉప సర్పంచులందరికీ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఉప సర్పంచుల సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. ఈ సమావేశంలో ముధోల్ మండల ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గంగారెడ్డితో పాటు తరోడ, ముద్గల్, గన్నోర్, చించాల గ్రామాల ఉప సర్పంచులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# దేవుడిని వెతుకుతున్న మనిషి... తనలోకి ఎప్పుడు చూస్తాడు?

## ఆధ్యాత్మికత అంటే బయట వెతకడం కాదు.. మనలోని మనిషిని మార్చుకోవడం

మనిషి జీవితంలో ఏదో ఒక దశలో ఒక ప్రశ్న తప్పకుండా ఎదురవుతుంది. ఎంత సంపాదించినా ఎందుకు అసంతృప్తి? ఎంత మంది చుట్టూ ఉన్నా ఎందుకు ఒంటరితనం? ఎన్నో సౌకర్యాలు ఉన్నా మనసుకు ప్రశాంతత ఎందుకు దొరకడం లేదు? ఈ ప్రశ్నలకు సమాధానం కోసం కొందరు దేవాలయాల వైపు వెళ్తారు. మరికొందరు పుణ్యక్షేత్రాలను సందర్శిస్తారు. ఇంకొందరు ధ్యానం, ఆధ్యాత్మిక గ్రంథాల వైపు మళ్లుతారు.

అయితే అసలు ఆధ్యాత్మిక ప్రయాణం ఎక్కడ మొదలవుతుంది? మనలో నుంచే. భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయం మనిషిని కేవలం బయటి ప్రపంచాన్ని జయించమని చెప్పలేదు. ముందుగా తనను తాను తెలుసుకోవాలని సూచించింది. మనసును నియంత్రించుకోవడం, కోరికలను అదుపులో ఉంచుకోవడం, కోపాన్ని జయించడం, ఇతరుల పట్ల కరుణతో వ్యవహరించడం వంటి లక్షణాలే ఆధ్యాత్మిక జీవితానికి పునాది.

దేవాలయానికి వెళ్లడం తప్పు కాదు. పూజలు చేయడం, వ్రతాలు పాటించడం, తీర్థయాత్రలు చేయడం కూడా మన సంప్రదాయంలో భాగమే. కానీ వాటి అంతిమ ఉద్దేశం మనిషిలో మంచి మార్పును తీసుకురావడమే. ఆలయంలో గంట మోగించిన తర్వాత మన మాటల్లో ద్వేషం కొనసాగితే, దేవుడికి పూజ చేసిన తర్వాత మనసులో అసూయ మిగిలితే, తీర్థయాత్ర చేసి వచ్చిన తర్వాత కూడా ఎదుటివారి కష్టాన్ని పట్టించుకోకపోతే మన ఆధ్యాత్మిక ప్రయాణం ఇంకా పూర్తి కాలేదనే అర్థం.

మన దేవాలయాల్లోని అనేక ప్రతీకలు కూడా మనిషి అంతరంగాన్ని శుద్ధి చేసుకోవాలనే సందేశాన్నే అందిస్తాయి. గర్భగుడిలోని చీకటిలో వెలిగే దీపం జ్ఞానానికి ప్రతీకగా భావించవచ్చు. దేవుడి ముందు తల వంచడం అహంకారాన్ని తగ్గించుకోవడానికి గుర్తుగా చూడవచ్చు. ప్రసాదం స్వీకరించడం ద్వారా పొందినదాన్ని పంచుకోవాలనే భావనను గుర్తుచేసుకోవచ్చు.

నేటి సమాజంలో మనిషికి అన్నింటికంటే ఎక్కువగా అవసరమైనది మానసిక ప్రశాంతత. సాంకేతిక పరిజ్ఞానం జీవితం సులభం చేసినా, మనసులోని ఆందోళనలను పూర్తిగా తొలగించలేకపోయింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఫోన్, సామాజిక మాధ్యమాలు, ఉద్యోగ ఒత్తిడి, ఆర్థిక ఆలోచనలు, కుటుంబ సమస్యలు మనిషిని నిరంతరం వెంటాడుతున్నాయి.



ఇలాంటి పరిస్థితిలో రోజులో కొంత సమయం తనతో తాను గడపడం కూడా ఒక ఆధ్యాత్మిక సాధనే.

భగవద్గీతలో శ్రీకృష్ణుడు మనసును నియంత్రించుకోవడం ఎంత కష్టమో, అదే సమయంలో సాధన ద్వారా అది సాధ్యమని వివరిస్తాడు. మనిషి బయట ప్రపంచాన్ని మార్చడానికి ముందుగా తన ఆలోచనలను మార్చుకోవాలి. ఆలోచనలు మారితే మాటలు మారతాయి. మాటలు మారితే ప్రవర్తన మారుతుంది. ప్రవర్తన మారితే కుటుంబం మారుతుంది. కుటుంబం మారితే సమాజం మారుతుంది.

అందుకే ఆధ్యాత్మికతను కేవలం మతపరమైన కార్యక్రమంగా చూడటం సరిపోదు. అది వ్యక్తిత్వ వికాసానికి ఒక మార్గం. మనలోని చెడును తగ్గించి, మంచిని పెంచే ప్రక్రియ.

పేదవాడికి అన్నం పెట్టడం, వృద్ధుడికి చేయూత ఇవ్వడం, బాధలో ఉన్నవారిని ఓదార్చడం, ప్రకృతిని కాపాడడం, మాట ఇచ్చి నిలబెట్టుకోవడం, తల్లిదండ్రులను గౌరవించడం---ఇవన్నీ కూడా ధర్మమే. భగవంతుడికి సమర్పించే పూల కంటే మనిషికి చేసే సహాయం గొప్పదిగా మారే సందర్భాలు ఎన్నో ఉంటాయి.

మనిషి దేవుడిని ఎక్కడ వెతికినా చివరకు తనలోని మంచితనాన్నే కనుగొనాలి. ఎందుకంటే దేవుడి దర్శనం కంటే మనిషిలోని మానవత్వం మేల్కొనడం ఆధ్యాత్మికతకు అసలైన విజయం.

అందుకే దేవుడిని వెతకడానికి ఆలయానికి వెళ్లే ముందు ఒక్కసారి మనలోకి కూడా తొంగి చూడాలి. మనలో కోపం ఎంత ఉంది? అహంకారం ఎంత ఉంది? స్వార్థం ఎంత ఉంది? ఇతరుల పట్ల ప్రేమ ఎంత ఉంది? అనే ప్రశ్నలు వేసుకోవాలి.

ఆత్మపరిశీలన మొదలైన చోటే నిజమైన ఆధ్యాత్మిక ప్రయాణం మొదలవుతుంది. దేవుడి కోసం దూర ప్రాంతాలకు వెళ్లే ముందు మనలోని మనిషిని మేల్కొలిపితే... అదే మన జీవితానికి నిజమైన తీర్థయాత్ర.

**-- తెలంగాణ వెన్నెల వాక్కు ప్రత్యేక విశ్లేషణ**

# తెలంగాణలో వర్షాలకు కాస్త విరామం

వర్షాభావ పరిస్థితులతో ఇబ్బంది పడిన రైతులకు ఇటీవల కురిసిన వర్షాలు కొంత ఊరట కలిగించాయి. ముఖ్యంగా పంటల సాగు ప్రారంభించిన రైతులకు ఈ వర్షాలు ఉపయోగకరంగా మారాయి. మరోవైపు కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షపాతం నమోదవడంతో పొలాల్లో నీరు నిలిచే పరిస్థితి ఏర్పడింది. దీంతో పంటలకు మేలు చేసే వర్షం ఎంత అవసరమో, అదే సమయంలో అధిక వర్షం వల్ల నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యమని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. తెలంగాణలో సాధారణంగా ఆగస్టు నెలలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా ఉంటాయి. ఈ సమయంలో ఏర్పడే అల్పపీడనాలు, ఉపరితల ఆవర్తనాలు, గాలుల దిశలో మార్పులు రాష్ట్రంలోని వర్షపాతాన్ని ప్రభావితం చేస్తాయి. కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండగా మరికొన్ని ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో జిల్లాల వారీగా వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తూ అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గత వర్షాల ప్రభావంతో చెరువులు, కుంటలు, వాగులు, ప్రాజెక్టుల్లో నీటి లభ్యత పెరిగింది. కొన్ని ప్రాంతాల్లో నీటి నిల్వలు పెరగడం రైతులకు ప్రయోజనకరంగా మారింది. అయితే ప్రాజెక్టులు, వాగులు, లోతట్టు ప్రాంతాల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

వర్షాలు తగ్గుముఖం పట్టిన సమయంలో రైతులు వ్యవసాయ పనులను వేగవంతం చేస్తున్నారు. పొలాల్లో నిలిచిన నీటిని అవసరమైతే బయటకు పంపించడం, పంటకు తగిన ఎరువుల వినియోగం, కలుపు నివారణ వంటి పనులపై రైతులు దృష్టి పెడుతున్నారు. వర్షాల మధ్య విరామం లభించడం వ్యవసాయ పనులకు అనుకూలంగా మారే అవకాశం ఉంది.

మరోవైపు రహదారుల పరిస్థితిపైనా అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. భారీ వర్షాల కారణంగా కొన్ని గ్రామీణ రహదారులు దెబ్బతినడం, గుంతల్లో నీరు నిలవడం, చిన్న వంతెనల వద్ద నీటి ప్రవాహం పెరగడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. వాహనదారులు నీటి ప్రవాహం ఉన్న ప్రాంతాల్లో జాగ్రత్తగా ప్రయాణించాలని అధికారులు సూచిస్తున్నారు.

పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థపై కూడా ప్రత్యేక దృష్టి అవసరమవుతోంది. తక్కువ సమయంలో అధిక వర్షం కురిసినప్పుడు డ్రైనేజీ కాలువలు నిండిపోవడంతో రహదారులపై నీరు చేరే పరిస్థితి ఏర్పడుతోంది. వర్షాలకు విరామం లభించిన సమయంలో కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడం, నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడడం ద్వారా ముంపు సమస్యను తగ్గించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

రానున్న రోజుల్లో వర్షాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. వాతావరణ పరిస్థితులు వేగంగా మారే అవకాశం ఉన్నందున ఒకే ప్రాంతంలో వం-ర్షపాతం ఎక్కువగా, మరో ప్రాంతంలో తక్కువగా నమోదయ్యే పరిస్థితి ఏర్పడవచ్చు. అందువల్ల జిల్లా యంత్రాంగాలు వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

రైతులకు కూడా వాతావరణ సూచనలు కీలకంగా మారాయి. వర్షం వచ్చే అవకాశాన్ని బట్టి ఎరువుల వినియోగం, పురుగుమందుల పిచికారీ, పంట సంరక్షణ చర్యలను చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. వర్షం ముందు లేదా వెంటనే పిచికారీ చేస్తే మందుల ప్రభావం తగ్గే అవకాశం ఉన్నందున వాతావరణ పరిస్థితులను గమనించి నిర్ణయం తీసుకోవాలని చెబుతున్నారు.

ఇటీవల రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో భూగర్భ జలాల పరిస్థితి కూడా మెరుగుపడే అవకాశం ఉంది. చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లు నీటితో నిండితే రాబోయే నెలల్లో సాగునీటి అవసరాలకు కొంత భరోసా లభిస్తుంది. అయితే నీటి వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో వర్షాలకు తాత్కాలిక విరామం కనిపిస్తున్నప్పటికీ పూర్తిగా వర్షాలు తగ్గిపోయాయని చెప్పే పరిస్థితి లేదని వాతావరణ పరిశీలకులు సూచిస్తున్నారు. ఉత్తర, తూర్పు జిల్లాల్లో వర్షాలు కొనసాగవచ్చన్న అంచనాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

రైతులకు అవసరమైన సమయంలో వర్షాలు అందడం, అదే సమయంలో అధిక వర్షాలతో పంటలు దెబ్బతినకుండా చూడటం ఇప్పుడు ప్రధాన అంశంగా మారింది. వర్షాల పరిస్థితిని జిల్లాల వారీగా పర్యవేక్షిస్తూ ముందస్తు చర్యలు తీసుకుంటే నష్టాన్ని తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు.



# ఎస్ఐఆర్‌పై తెలంగాణలో దుమారం

స్పష్టం చేస్తున్నారు. ఎన్యుమరేషన్ ఫారాల విషయంలో ఎక్కడైనా సమస్యలు ఎదురైతే సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించాలని సూచిస్తున్నారు. బూత్ స్థాయిలో పనిచేస్తున్న అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండటం, ఓటర్లు తమ వివరాలను పరిశీలించుకోవడం ద్వారా భవిష్యత్తులో ఇబ్బందులను నివారించవచ్చని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల ప్రక్రియలో సాంకేతికత వినియోగం పెరిగినప్పటికీ క్షేత్రస్థాయిలో అధికారుల పాత్ర కీలకంగానే ఉంది. ఇంటింటి సర్వే సందర్భంగా వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరిగా నివసించే వ్యక్తులు, వలస వెళ్లిన కుటుంబాలు వంటి వర్గాల వివరాలను సరిగ్గా నమోదు చేయాల్సిన అవసరం ఉంది. చిన్నపాటి పొరపాటు జరిగినా అది ఓటరు హక్కుపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో అధికారులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఎస్ఐఆర్ ప్రక్రియపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఎన్నికల యంత్రాంగం మరింత స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఏ ప్రాంతంలో ఏ అధికారి అందుబాటులో ఉంటారు, ఫారం ఎక్కడ అందించాలి, తిరస్కరణకు గురైతే ఎవరిని సంప్రదించాలి అనే విషయాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయడం ద్వారా అనుమానాలను నివృత్తి చేయవచ్చని అంటున్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను రాజకీయ కోణంలో కాకుండా ప్రజాస్వామ్య ప్రక్రియలో ఒక ముఖ్యమైన దశగా చూడాల్సిన అవసరం ఉందని పలువురు సూచిస్తున్నారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, అదే సమయంలో నకిలీ లేదా అనర్హమైన నమోదులను తొలగించడం మధ్య సమతుల్యత పాటించాల్సి ఉంటుంది. ఎన్యుమరేషన్ ఫారాల స్వీకరణ విషయంలో వచ్చిన ఫిర్యాదులను ఎన్నికల అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటే సమస్యలు త్వరగా పరిష్కారమయ్యే అవకాశం ఉంది. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో స్పష్టంగా అమలు చేయడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించడం కూడా అవసరం. ఎస్ఐఆర్ ప్రక్రియ ముందుకు సాగుతున్న కొద్దీ రాజకీయ పార్టీల నుంచి మరిన్ని అభ్యంతరాలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎన్నికల యంత్రాంగం పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఫారాల స్వీకరణ, వివరాల పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం వంటి ప్రక్రియలను సజావుగా పూర్తి చేయడమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

